# ఇతర రాష్ట్రాల వారి మద్దతు బీఆర్ఎస్‌కే

- జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్
- పార్టీలో చేరిన పలువురు ఒడిశా వాసులు



బీఆర్ఎస్‌లో చేరిన ఒడిశా రాష్ట్రానికి చెందిన యువకులతో జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, నవంబర్ 9: ఇతర రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చి.. హైదరాబాద్‌లో స్థిరపడిన అనేక మంది బీఆర్ఎస్‌కు మద్దతు పలుకుతున్నారని జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని వెంకటగిరిలో నివాసముంటున్న 50 మంది ఒడిశా వాసులు గురువారం మాగంటి గోపీనాథ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌కు వచ్చి హోటళ్లు, ఇతర పనుల ద్వారా ఉపాధి పొందుతున్న తమకు కరోనా సమయంలో బీఆర్ఎస్ ఎంతో సాయం చేసిందని ఒడిశా వాసులు తెలిపారు. ఈ అభిమానంతోనే బీఆర్ఎస్‌కు అండగా ఉంటామన్నారు. దీంతో చాలా మంది ఒడిశా వాసులు పార్టీలో చేరుతున్నారని మాగంటి గోపీనాథ్ తెలిపారు. కరోనా సమయంలో అనేక రాష్ట్రాలకు చెందిన వలస కూలీలను రాష్ట్ర ప్రభుత్వం సొంత ఖర్చుతో సొంతూళ్లకు పంపించిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. దీంతో వీరంతా బీఆర్ఎస్‌కు అండగా ఉంటామని సంతోషంగా చెబుతున్నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, బసవరాజు, శ్రీనగర్ కాలనీ బీఆర్ఎస్ అధ్యక్షుడు అప్పూఖాన్‌తో పాటు పార్టీలో చేరిన ప్రతాప్‌కుమార్, డీజే నాయక్, అశోక్ బెహ్రా, దీపక్ బెహ్రా తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థికి ఓయూజేఏసీ మద్దతు

**అనిల్ గెలుపు కోసం గడపగడపకు ప్రచారం నిర్వహిస్తామని వెల్లడి**



మాట్లాడుతున్న దత్తాత్రేయ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 9: ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్‌కు ఓయూజేఏసీ సంపూర్ణ మద్దతును ప్రకటించింది. ఆయన గెలుపు కోసం బోథ్ నియోజకవర్గంలో గడపగడపకూ వెళ్లి ప్రచారం నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఓయూజేఏసీ అధ్యక్షుడు డాక్టర్ ఎల్చాల దత్తాత్రేయ మాట్లాడుతూ.. బోథ్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా ఉన్న ఎంపీ సోయం బాబూరావు గిరిజన, ఆదివాసీ మహిళల అక్రమ రవాణా కేసులో నిందితుడని ఆరోపించారు. అమాయకులైన మహిళలను అక్రమంగా రవాణా చేస్తూ గుజరాత్‌లో దొరికిపోయిన దొంగగా సోయంను అభివర్ణించారు. ఎంపీ నిధులతోనే కొడుకు పెళ్లి, ఇంటి నిర్మాణం చేసుకున్నానంటూ ఆయన చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఎంపీ నిధులను సొంత అవసరాలకు వినియోగించుకున్న చరిత్ర, ప్రజలను మోసం చేసిన చరిత్ర ఉన్న వ్యక్తి కావాలో.! ప్రజల కోసం నిరంతరం పనిచేసే వ్యక్తి కావాలో.! బోథ్ నియోజకవర్గ ప్రజలు ఆలోచించుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ ఒక్కడే శ్రీరామరక్ష అని అభిప్రాయపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాలో అనిల్ జాదవ్, జోగు రామన్నను గెలిపించి, కేసీఆర్‌కు కానుకగా అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఓయూజేఏసీ నాయకులు పాండు జాదవ్, మల్లెల స్వామి, అలాలి వెంకటేశ్, బానోతు రవీందర్, వంశీకృష్ణ, సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడిగా రామ్‌కుమార్



సిటీబ్యూరో, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల కోసం రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎల్బీనగర్-49, మహేశ్వరం-50 నియోజకవర్గాలకు సాధారణ పరిశీలకులను భారత ఎన్నికల కమిషన్ నియమించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలీకేరీ తెలిపారు. పై నియోజకవర్గాలకు సాధారణ పరిశీలకుడిగా రామ్‌కుమార్‌ను గురువారం నియమించడంతో.. కలెక్టర్ భారతి హోలీకేరీ, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్‌తో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర శాసనసభ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లాలో చేపడుతున్న కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు.

## ఎన్నికల ప్రచారంలో పిల్లలు లేకుండా చూడాలి

అబిడ్స్, నవంబర్ 9: బాలల హక్కుల రక్షణ చట్టం 2005 ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, బాల, బాలికలను ఎన్నికల ప్రచారం, ఎన్నికల కార్యక్రమాలలో ఉపయోగించరాదని బాలల హక్కుల రక్షణ చట్టం చైర్మన్ జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని భారత ఎన్నికల కమిషన్ అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ప్రధాన ఎన్నికల అధికారులు, అన్ని గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు నిర్దిష్టమైన సూచనలను జారీ చేసినట్లు తెలిపారు.

## ఇన్‌స్టాలో పరిచయం.. ప్రేమ

వెంగళరావునగర్, నవంబర్ 9 : ప్రియుడి వేధింపులు భరించలేక ఓ యువతి మధురానగర్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల కథనం ప్రకారం.. హన్మకొండకు చెందిన యువతి (20) వెంగళరావునగర్‌లోని ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ చదువుతున్నది. ఏడాది కిందట ఇన్‌స్టాలో వరంగల్‌కు చెందిన రమేశ్ (25)తో ఏర్పడిన పరిచయం.. వారి మధ్య ప్రేమకు దారి తీసింది. యువతితో సన్నిహితంగా మెలిగిన సమయంలో రమేశ్ ఆమె ఫొటోలు తీశాడు. మూడు నెలల కిందట రమేశ్ ప్రవర్తన నచ్చక.. అతడిని దూరం పెట్టసాగింది. ప్రియురాలి ఎడబాటు రమేశ్‌లో కోపం పెంచింది. మళ్లీ తనతో గడపాలని పట్టుబట్టాడు. అందుకు ఆమె నిరాకరించింది. దీంతో ప్రియురాలిపై కక్షగట్టాడు. తనను కాదంటే.. సన్నిహితంగా ఉన్న సమయంలో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరించాడు. దీంతో ఆ యువతి మధురానగర్ పోలీసులను ఆశ్రయించింది. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# వాట్సాప్ స్టేటస్ చూసి.. రూ.45లక్షలు చోరీ

- కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేసిన ఫిలింనగర్ పోలీసులు
- వాట్సాప్ స్టేటస్ పెడుతున్నారా..! కొంచెం ఆలోచించండి.. పోలీసుల సూచన



వివరాలను వెల్లడిస్తున్న ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న నగదు

బంజారాహిల్స్,నవంబర్ 9: గతంలో పనిచేసి, మానేసిన యజమాని తన కుటుంబంతో కలిసి ఫామ్‌హౌజ్‌కు వెళ్లినట్లు వాట్సాప్ స్టేటస్ ద్వారా తెలుసుకున్న కారు డ్రైవర్.. అతడి ఇంట్లోకి ప్రవేశించి రూ.45 లక్షలు తస్కరించాడు. ఈ ఘటన ఫిలింనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. వివరాలను ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ గురువారం విలేకరులకు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన పేదాడ రామకృష్ణ(29) పటేల్‌నగర్‌లో నివాసముంటూ కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా జల్సాలకు అలవాటు పడిన అతడు డబ్బుల కోసం చోరీ చేస్తున్నాడు. గతంలో అతడు జూబ్లీహిల్స్ రోడ్ నం. 78లోని ఫీనిక్స్ అపార్ట్‌మెంట్స్‌లో నివాసముంటున్న వడ్లమూడి శ్రీహర్ష అనే వ్యాపారివద్ద కారు డ్రైవర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో యాజమాని వద్దనుంచి ఫ్లాట్ తాళం చెవి కాజేసి తన వద్దనే ఉంచుకున్నాడు. కాగా, పని మానేసినా తాళం చెవి మాత్రం రామకృష్ణ వద్దనే ఉంచుకున్నాడు. ఎలాగైనా శ్రీహర్ష ఇంట్లో చోరీ చేయాలని నిర్ణయించుకున్న నిందితుడు.. అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 5న శ్రీహర్ష తన కుటుంబ సభ్యులతో కలిసి మొయినాబాద్‌లోని ఫామ్‌హౌజ్‌కు వెళ్లినట్టు వాట్సాప్ స్టేటస్ ద్వారా నిందితుడు తెలుసుకున్నాడు. తన వద్దనున్న తాళం చెవితో ఇంట్లోకి ప్రవేశించాడు. కప్ బోర్డులో ఉన్న రూ.45 లక్షలను తీసుకొని ఉడాయించాడు. ఫామ్‌హౌజ్ నుంచి తిరిగి వచ్చిన శ్రీహర్ష ఇంట్లో దొంగతనం జరిగినట్టు గుర్తించి.. ఈనెల 7వ తేదీన ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడు రామకృష్ణను బుధవారం రాత్రి అరెస్ట్ చేసిన పోలీసులు.. అతడి వద్ద నుంచి రూ.45లక్షల నగదుతో పాటు ఇంటి తాళం చెవిని స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు. వాట్సాస్ స్టేటస్ పెట్టే సమయంలో కొంచెం ఆలోచిస్తే ఇలాంటి పరిస్థితి రాదని ఇన్‌స్పెక్టర్ ప్రజలకు సూచించారు.

## కూతుర్ని ప్రేమిస్తున్నాడని..

# యువకుడి దారుణ హత్య

### అన్నోజిగూడలో ఘటన



హత్యకు గురైన ధరావత్ కరణ్(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 9: కూతుర్ని ప్రేమించాడన్న కోపంతో ఓ యువకుడి మర్మాంగాలపై కారం చల్లి, కర్రలతో దాడిచేసి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. గజ్వేల్‌కు చెందిన దరావత్ సుశీల, తన కుమారుడు కరణ్(18)తో కలిసి 15 ఏండ్ల కిందట అన్నోజిగూడలోని లక్ష్మీనర్సింహ కాలనీకి వచ్చింది. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి ఇంటికి సమీపంలోనే మహారాష్ట్రకు చెందిన కుటుంబాలున్నాయి. ఈ కుటుంబాలకు చెందిన ఓ బాలిక(15)తో కరణ్‌కు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ప్రేమగా మారింది. వీరిద్దరూ తరచూ కలుసుకుంటున్నారు. బుధవారం రాత్రి బాలిక ఇంట్లో ఎవరూ లేరు. దీంతో యువకుడు ఆమె ఇంటికి వెళ్లాడు. యువకుడిని గమనించిన బాలిక తల్లిదండ్రులు, సోదరులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బాలికను వేరే గదిలో బంధించి.. కరణ్‌ను మరో గదిలో వేసి కర్రలు, బెల్టుతో చితకబాదారు. మర్మాంగాలపై కారం చల్లుతూ రాత్రి 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు దాడి చేశారు. చుట్టుపక్కల ఎవరూ లేని సమయంలో యువకుడిని అతడి ఇంటి ముందు పడవేశారు. ఇంట్లోకి వెళ్లి అపస్మారక స్థితిలో పడిపోయిన కరణ్‌ను గమనించిన తల్లి.. ఇరుగుపొరుగు సహాయంతో ఘట్‌కేసర్ ప్రభుత్వ దవాఖానకు తరలించింది. దవాఖానలో పరీక్షించిన వైద్యులు యువకుడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోచారం ఐటీసీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు విచక్షణ రహితంగా దాడి చేసి, హత్య చేసినట్టు గుర్తించారు. దాడికి పాల్పడిన బాలిక సోదరుడు శింగాడే కరణ్(18), తండ్రి శింగాడే దోండిబా(45), తల్లి రాధాబాయి(34), బంధువులు సురేశ్(30), నామ్‌దేవ్ (22), సుధీర్(20), మాధవ్(30), కందు(45), జల్బా(32), గజానంద్(27)ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖాన మార్చురీకి తరలించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, కేసు దర్యాప్తులో ఉన్నదని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## నువ్వు నాతోనే ఉండాలి.. కాదంటే ఖతం చేస్తా..

- మాజీ ప్రియురాలిని బెదిరిస్తున్న ప్రియుడు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి, కేసు నమోదు

వెంగళరావునగర్, నవంబర్ 9 : నువ్వు నా దానివి.. జీవితాంతం నాతోనే ఉండాలి.. కాదంటే ఖతం చేస్తా.. అంటూ బెదిరిస్తున్న మాజీ ప్రియుడిపై బాధిత యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్ వీడియో గల్లీకు చెందిన చందూలాల్ (26) అదే ప్రాంతానికి చెందిన యువతి (24)తో మూడేళ్లపాటు సహజీవనం చేశాడు. 2018 నుంచి 2021 వరకు వీరు కలిసే ఉన్నారు. అయితే, తనతో సహజీవనం చేస్తున్న యువతిపై అనుమానం పెంచుకుని సూటిపోటి మాటలతో హింసించాడు. దీంతో వీరిద్దరూ పెద్దల సమక్షంలో విడిపోయారు. అయితే.. అన్ని మర్చిపోయి తనతోనే ఉండాలంటూ ఇటీవల చందూలాల్ యువతిని బెదిరిస్తూ.. గొడవ చేస్తున్నాడు. తనతో ఉండకపోతే చంపేస్తానంటూ హెచ్చరిస్తున్నాడు. భయాందోళనకు గురైన ఆ యువతి పోలీసులను ఆశ్రయించింది. యువతి ఫిర్యాదు మేరకు చందులాల్‌పై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## చందానగర్‌లో భారీగా నగదు పట్టివేత

కొండాపూర్, నవంబర్ 9 : చందానగర్ పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ. 11,91,828 నగదును స్వాధీనం చేసుకున్నారు. వివరాలు నమోదు చేసుకొని.. ఆ నగదును ఆదాయపన్ను శాఖకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## ప్రశాంత్‌రెడ్డి బెయిల్ పిటిషన్ కొట్టివేత

నాంపల్లి కోర్టులు, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో 16వ నిందితుడు సాన ప్రశాంత్‌రెడ్డి అలియాస్ ప్రశాంత్ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ 12వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జి.ఈశ్వరయ్య గురువారం తీర్పు వెల్లడించారు. కస్టడీ పిటిషన్‌ను తిరస్కరించడంతో సిట్ అధికారులు జిల్లా కోర్టును ఆశ్రయించనున్నారని కోర్టు ఉత్తర్వులలో పేర్కొన్నది. కేసు నమోదైన నాటి నుంచి ఇప్పటి వరకు కోర్టుకు సహకరించలేదని, నిందితుడు న్యూజిలాండ్‌కు వెళ్లి కోర్టుకు హాజరుకాలేదని పేర్కొంది.